క్లుప్తంగా

వైభవంగా మహారుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి: కార్తికమాసం పురస్కరించుకుని మండలంలోని మాదాపూర్ శ్రీకృష్ణ గోశాల వద్ద హనుమాన్ చాలీసా పారాయణం, మహారుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ వ్రతాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకే నిర్బంద తనిఖీలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కోటపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు నిర్బంద తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని పిన్నారం గ్రామంలో బుధవారం ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 28 బైక్‌లు, 3 ఆటోలు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

నేషనల్ ప్రేయర్ డేకు తరలిన క్రైస్తవులు



తరలివెళ్తున్న క్రైస్తవులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బుధవారం జరిగిన నేషనల్ ప్రేయర్ డే కార్యక్రమానికి ఇంటర్‌డినామినేషనల్ పాస్టర్స్ అసోసియేషన్ మంచిర్యాల రీజియన్(ఐపీఏఎంఆర్) నుంచి క్రైస్తవులు తరలివెళ్లారు. మంచిర్యాల, హాజీపూర్, నస్పూర్, శ్రీరాంపూర్ నుంచి దాదాపు 50కి పైగా వాహనాల్లో వెళ్లారు. ఐపీఏఎంఆర్ అధ్యక్షుడు పాస్టర్ సామ్యేల్, సభ్యులు మాథ్యు జార్జ్, ప్రసాద్, ఆనంద్, ఏలియా, జాన్‌ప్రసాద్, సతీశ్, నాతానియేల్, రాజారత్నం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైబర్‌క్రైం సీఐ కృష్ణమూర్తి

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలక్రైం: స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై రామగుండం సైబర్‌క్రైమ్ సీఐ కృష్ణమూర్తి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో ప్రొఫైల్, డీపీలు వ్యక్తిగత సమాచారం పెట్టుకోవద్దన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ తదితర అంశాల గురించి వివరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే డయల్ 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ టీమ్ శంకర్, వెంకటేశ్, కుమార్, మహిళా కానిస్టేబుల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు బోనస్

దండేపల్లి: ప్రభుత్వం గుర్తించిన సన్నాలకు కొనుగోలు కేంద్రాల్లో బోనస్ వస్తుందని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని ముత్యంపేట, నెల్కివెంకటాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు ధాన్యంలో తాలు తప్ప లేకుండా తేమ శాతం 17లోపు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ప్రభుత్వ బోనస్‌పై రైతులకు అవగాహన కల్పించారు. డీపీఎం వేనుగోపాల్, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు ఉన్నారు.

రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: కోనంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటల్లో నాణ్యతా ప్రమాణాలపై ఏడీఏ బానోతు ప్రసాద్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. కోటపల్లి ఏవో సాయికృష్ణ, ఏఈవో రాజశేఖర్ ఉన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

- మంచిర్యాల పట్టణంలో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- కార్మికుల కొరతతో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇన్‌చార్జీల పర్యవేక్షణలో మెరుగుపడని శుభ్రత
- డిప్యూటేషన్‌పై సూపర్‌వైజర్‌ను కేటాయించినా అదే దుస్థితి..



భగత్‌నగర్‌లో ఇళ్ల మధ్య పేరుకుపోతున్న చెత్తాచెదారం

మంచిర్యాలలో..

మున్సిపల్ వార్డులు: 36
పర్మినెంట్ కార్మికులు: 34
కాంట్రాక్టు కార్మికులు: 277

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంగా ఉన్న మంచిర్యాల పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా, 311 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో సగం మంది ఒక్కో వార్డులో నలుగురు చొప్పున ప్రతిరోజు వార్డును పరిశుభ్రంగా ఉంచేలా పనిచేయాల్సి ఉన్నా, కేవలం ఒకరిద్దరితోనే కానిచేస్తున్నారు. మిగతా సగం మంది కార్మికులు వాహనాల డ్రైవింగ్, డంపింగ్ యార్డు, ఇతరత్రా పనులకు వినియోగిస్తున్నారు. వార్డుకు నలుగురు చొప్పున ప్రతిరోజు పనిచేయించేందుకు అవకాశం ఉన్నా, పారిశుధ్య విభాగంలో కీలకపోస్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఖాళీగా ఉండడంతో, ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో పారిశుధ్య విభాగం అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా హెల్త్ అసిస్టెంట్ ఉదయ్‌కు, మరో ఇన్‌చార్జిగా జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకు బాధ్యతలను అప్పగించారు. ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తుండగా, సూపర్‌వైజర్‌గా కరీంనగర్‌లో పనిచేస్తున్న రాజమనోహర్‌గౌడ్‌ను మంచిర్యాల మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై కేటాయించారు. ముగ్గురు అధికారులు శానిటరీ విభాగంలో పనులు నిర్వహిస్తున్నా, మంచిర్యాల మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెడితే తప్ప ప్రస్తుతం మంచిర్యాల మున్సిపాలిటీ చెత్తరహిత మున్సిపాలిటీగా మారేందుకు అవకాశం ఉంది.



అశోక్‌రోడ్డులో రోడ్డు పక్కనే వేసిన చెత్త కుప్ప

ఎటు చూసినా చెత్తకుప్పలే..

మంచిర్యాల మున్సిపాలిటీలో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయి. జిల్లాకేంద్రం కావడంతో, నివసించే జనాభా ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, ఆండాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కొన్ని వార్డుల్లో రెండు రోజులకోసారి చెత్తను సేకరిస్తున్నారు. మరికొన్ని వార్డుల్లో వేసిన చెత్తకుప్పలను అలాగే వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తుండగా, కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ కార్యక్రమాలను గతనెలలో అధికారులు, సిబ్బంది కలిసి ప్రతీవార్డులో చెత్తను లేకుండా చేశారు. కార్యక్రమాల ముగింపుతో వార్డుల్లో పేరుకుపోతున్న చెత్తను నిత్యం తొలగింపునకు బ్రేక్ పడింది. ప్రధాన వార్డులు తప్ప మారుమూల ప్రాంతాల్లోని కాలనీల్లో చెత్త తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఇద్దరికి బాధ్యతలు అప్పగించడం, వారికి అధికారిగా ఓ సూపర్‌వైజర్‌ను డిప్యూటేషన్‌పై తీసుకురావడం వల్లనే పారిశుధ్య పనులను ఇద్దరు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక కార్మికులు పేరుకుపోతున్న చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించకుండా తాత్సారం చేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం



మున్సిపాలిటీలో కార్మికులు సరిపోవడం లేదు. గతంలో 30 మంది కార్మికులను రోజువారీగా తీసుకోగా, కొంత వరకు కార్మికుల కొరత లేకుండా పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాం. తాత్కాలికంగా పనిచేస్తున్న 30 మంది కార్మికుల తొలగింపుతో కొంత ఇబ్బందిగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిన వెంటనే తొలగించేలా చేస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం.
– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాంప్రసాద్

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు బకాయిల నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఇప్పటికి విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు రంజిత్, వాసు, మహేశ్, సాయి, రాకేశ్, తిరుపతి, రవి, నగేశ్, శేఖర్ పాల్గొన్నారు.

శైలజ మృతి కారకులను శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాలీ సంక్షేమ సంఘం నాయకులు

వేమనపల్లి: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి కారకులను శిక్షించాలని మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నెండుగూరి మధుసూదన్, జిల్లా నాయకుడు మోర్ల రమేశ్ డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్‌పాయిజన్‌తో మృతిచెందిందని విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు ఐదెకరాల ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్,శంకర్, జనార్దన్, మొండి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట: మండలంలోని నాయకపుగూడ, గట్రావుపల్లి, అచ్యుతరావుగూడెం, లచ్చిరెడ్డిగూడల్లో సీసీ రోడ్లు, తుడుంగూడలో బ్రిడ్జి నిర్మాణానికి ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధికారులు బుధవారం భూమిపూజ చేశారు. అచ్యుతరావుగూడెం నుంచి లచ్చిరెడ్డిగూడెం వరకు నాయకపుగూడెం నుంచి గట్రావుపల్లి పంచాయతీలోని గ్రామాలను కలుపుతూ సీసీ రోడ్లు, తుడుంగూడెం వెళ్లేదారిలో బ్రిడ్జి నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్లు ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ యూనిట్ హెడ్ బాలగిరిధర్ తెలిపారు. సీనియర్ జీఎం హెచ్‌ఆర్ అనంద్ కులకర్ణి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

జన్నారం: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మండలానికి చెందిన రాజ్యాంగ పరిరక్షకుడు, అంబేద్కర్ అవార్డు గ్రహీత బోర్లకుంట ప్రభుదాస్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో వారం రోజులు రాజ్యాంగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య, స్నేహ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రవీణ్, బచ్చల శివ, పోశం, రాహుల్, రాజనర్సు, ఐలవేణి శ్రీనివాస్, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది మాజీద్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి



లక్సెట్టిపేట: మాట్లాడుతున్న సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

చెన్నూర్: బాల్య వివాహాలను నిర్మూలించాలని చెన్నూర్ కోర్టు మెజిస్ట్రేట్ పర్వతపు రవి అన్నారు. బుధవారం రాత్రి బాల్‌వి వివాహ్ ముక్తి భారత్‌లో భాగంగా చెన్నూర్ కోర్టు ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. పాఠశాల ప్రత్యేకాధికారి సుమలత, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, ప్రత్యేక ప్రాసిక్యూటర్ ఆకుదారి రాంభావు, ఎస్సై సుబ్బారావు, న్యాయవాదులు మహేశ్, నాగుల పున్నం పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివి మంచి హోదాలో ఉన్నప్పుడు వివాహాలు చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సదస్సు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నీలకంఠేశ్వర్‌గౌడ్

నస్పూర్/లక్సెట్టిపేట: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఈనెల 29న నిర్వహించే సమగ్ర కులగణన చైతన్య సదస్సు విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలకంఠేశ్వర్‌గౌడ్ కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో, లక్సెట్టిపేటలోని ఐబీ ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల గుణన సర్వేకు అందరూ సహకరించాలని కోరారు. బీసీలకు ప్రత్యేక అవకాశాలు లభిస్తాయన్నారు. దశాబ్దాల క్రితం జరిగిన కులగణన వల్ల బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. చైతన్య సదస్సుకు బీసీ కులబాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజేశం గౌడ్, రాజయ్య, రత్నాకర్, శంకర్‌గౌడ్, రవీందర్, కళ్యాణ్, రవి, రాజేశం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లైబ్రరీ ప్రారంభం

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి మోడల్ లైబ్రరీని ఎంఈవో చిన్నయ్య బుధవారం ప్రారంభించారు. హెచ్‌ఎం రాజు, రూమ్ టూ రీడ్ ప్రోగ్రాం ఆఫీసర్లు నితిన్‌ఠాకూర్, మధు, మహేశ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు రమేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

చెన్నూర్: ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతన స్కేలు అమలు చేయాలని చెన్నూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి సుమలత పేర్కొన్నారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూటీఎఫ్ ఆధ్వర్యాన ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మండల ప్రత్యేకాధికారి సాంబశివరావును సన్మానిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కాసిపేట: మండల ప్రత్యేకాధికారిగా ఏడీ ఫిషరీస్ మంచిర్యాల సాంబశివరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు. ఎంపీవో షేక్ సబ్దర్‌అలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, తిరుపతి, ఏపీవో నవీన్ తదితరులు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశం బహిష్కరణ



సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పాలకవర్గ సభ్యులు

- మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు
- ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణ
- కలెక్టర్‌కు ఫిర్యాదు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన సాధారణ కౌన్సిల్ రసాభాసగా సాగింది. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వ్యవహారశైలిపై సమావేశంలో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకే విధులు నిర్వహిస్తున్నానని కమిషనర్ కౌన్సిలర్ల పట్ల బెదిరింపు ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రజలను ఇబ్బందులకు గురిచేయమని చెబుతున్నారా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ నీరు లేని వార్డుల్లో బోరుమోటార్ల స్టార్టర్లకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ముగ్గురు కమిషనర్లు బదిలీ అయ్యారని తెలిపారు. ఇక్కడ పనిచేసిన వారు ఈయన లాగా లేరన్నారు. కమిషనర్ వచ్చి నెల రోజుల కాకముందే ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆరోపించారు. ఆబాది భూముల్లో నిర్మాణాలు చేపడుతున్న ఇళ్లకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. 8 మంది పారిశుధ్య కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. గతంలో క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న మురళీకృష్ణపై ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆయన వ్యవహార శైలిపై కలెక్టర్ కుమార్ దీపక్‌తోపాటు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, పోగుల సతీశ్, కమ్మల శ్రీనివాస్, తుమ్మ రమేశ్, సుధాకర్, జోడు శంకర్, జగన్నాధుల శ్రీనివాస్, శ్యామల, స్రవంతి, నసీమాబేగం, అనిల్, శారద, శరణ్య, కోఅప్షన్ సభ్యులు అయుబ్ పాల్గొన్నారు.

పందులకు వ్యాక్సినేషన్

బెల్లంపల్లి: పట్టణంలో పెంపకం చేస్తున్న పందులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా పశు వైద్యాధికారులు బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కన్నాల బస్తీ ఇతర ప్రాంతాల్లో సంచారం చేసి క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ వేశారు. జిల్లా పశు సంవర్ధక, పశు వైద్యాధికారి ఇ.శంకర్ హాజరై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పందులకు వ్యాక్సినేషన్ వేయించాలని యాజమానులకు సూచించారు. మండల పశు వైద్యాధికారి పావని, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు

నస్పూర్: జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. పట్టణ పరిధిలోని సీతారాంపల్లి, తీగల్‌పహాడ్‌లో ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటపాటల ద్వారా వివరించారు. జిల్లాకేంద్రంలో ఈనెల 30న కళా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

జన్నారం: మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ బుధవారం సందర్శించారు.వంటగది, భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్‌ఎం శివరాజుకు సూచించారు.

సంక్షిప్త వార్తలు

కుట్టుమిషన్లు పంపిణీ

కాసిపేట: మండలంలోని గొండుగూడలో ఐదుగురు మహిళలకు మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ బుధవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీటిని పంపిణీ చేసినట్లు జీఎం తెలిపారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేశ్, ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఉన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో రిటైర్డ్ కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ కార్మిక సంఘం నాయకుడు వాసాల శంకర్ డిమాండ్ చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 2021 జులై తర్వాత రిటైర్డ్ అయిన కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ద్వారా చెల్లించాల్సిన పింఛన్ అమలు చేయాలన్నారు. భీమయ్య, మల్లయ్య, సర్జన్, ఎల్లారం పాల్గొన్నారు.

రేపు దీక్షాదివాస్

మందమర్రిరూరల్/భీమారం: మంచిర్యాలలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెన్నూర్ ఇన్‌చార్జి రాజా రమేశ్ తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో రాజా రమేశ్, భీమారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర్ రాజ్‌కుమార్ మాట్లాడారు. దీక్ష దివాస్‌కు నాయకులు, మేధావులు, కవులు, కళాకారులు తరలిరావాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు రాజశేఖర్, తిరుపతిరెడ్డి, అబ్బాస్, సంపత్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భజన కళాకారులను గుర్తించాలి

చెన్నూర్: సనాతన ధర్మం పరిరక్షణకు ఆలయాల్లో భజన చేస్తున్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని భజన కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి వెంకటచారి, ప్రధాన కార్యదర్శి ఎర్రోజు రమేశ్ కోరారు. కార్తికమాసం పురస్కరించుకొని చెన్నూర్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయం వరకు బుధవారం భజన చేస్తూ పాదయాత్రను ప్రారంభించారు. జిల్లాలోని భజన కళాకారులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పరిశీలన

తాండూర్: సమగ్ర ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని వేగవంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ ఆదేశించారు. తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయాల్లో డాటా ఎంట్రీలో నమోదు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

కోటపల్లి: ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాలు, రైతువేదికలో సమగ్ర ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని ఆన్‌లైన్ నమోదును బుధవారం జెడ్పీసీఈవో గణపతి పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం తదితరులు ఉన్నారు.

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర ఇంటింటా సర్వే డాటా ఎంట్రీలో నమోదు ప్రక్రియను మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు పరిశీలించారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సబ్దర్ అలీ తదితరులు ఉన్నారు.